

నా మిత్రులు నా ఊరి యాసలోని ఒక చిన్న అలవాటును చిన్నప్పట్నించి
ఎగతాళి చేస్తూ ఉంటే నాకెప్పుడూ బాధ కలగలేదు కానీ, ఇలాంటి అలవాటు
ఎక్కడ ఎలా పుట్టిందా అనే ఆలోచన మాత్రం మొదలైంది.
దాని ఫలితం ఈ ‘తపసుమాను.’ అమెరికా నుంచి నా స్నేహితురాలు
కూతురు ఇక్కడికి రాబోతోందని తెలిసాక మా మాటలు ఆ అమ్మాయికి
ఎలాంటి అభిప్రాయం కలిగిస్తాయోనన్న ఊహలకు రూపం కథగా మారింది.

కె.ఎ. మునిసురేష్ పిళ్లె

# 15 తపసుమాను

చరణ్ పరిమి





పరుగెత్తుకుంటా వచ్చేసింది ఒక పంది. తపసు జేస్కుంటా వుండే టోడెల్లా దిగ్గున లేసాడు. కోపం చిర్రెత్తుకొచ్చింది. తటాల్న బాణాలందు కోని... లాగిపెట్టి యేసినాడు. ఆ పందికాస్తా చచ్చూరుకుంది. దీన్తస్సా దియ్యా... యిదీ నేనియ్యాల యేటాడిన పంది... అని నిండా మురిసిపోక ముందే... మరొకడు లగెత్తుకుంటా వొచ్చేసినాడు. నాదీ ఆ పంది. తొలి బాణం నాటింది నేనూ... అంటా తగువు పెట్టుకున్నాడు. వోడి దగ్గర గూడా బాణాలుండాయి. సూట్టానికి యేటగాడి మాదిరిగానే వుండాడు. అట్టాగని యీడూరుకోలా. యిద్దరూ సవాళ్లిసరుకున్నారు. మాటలు ముదిరి సేతల్లోకొచ్చినాయి. చేతులకి విల్లులు మొలిసినాయి. అమ్ములు దూసినారు. ఒకరి మీదొకరు యేసుకుంటా వుండారు.

...యమాగా సాగిపోతండాది కిరాతార్జున బాగోతం. అర్జునుడి యేసగాడు ఒక్కో బాణమూ తీసి లాగిపెట్టి నానా మంత్రాలూ పజ్జేలు జదివి యిడస్తండాడు. అది యెగిరి బారడు దూరంలో పడతండాది. అవతల్నించి కిరాతుడి యేసంలో వుండే శివయ్య యేసంలో ఉండేవోడు గూడా తడవకో బాణం వదలతండాడు. అయిగూడా అలా గాల్లోకి ఎగిరి కాసింత దూరంలో పడిపోతండాయి. పజ్జేలే పజ్జేలు... బారెడున్నర రాగాలు తీసి ఆలపిస్తండారు. సుట్టూరా యెట్టా జూసినా జెనమే జనం. ఆలకిస్తాం డారు. కొంచేపుటికి పజ్జేలన్నీ అయిపోయినాక... అప్పటిదాకా యెవుడి మీదికైతే బాణాలేసినాడో వాడు బోయోడుగాదు శివయ్య అనే సంగతి అర్జునుడికి దెల్సిపోయింది. కుమిలిపోయినాడు. అడుక్కున్నాడు. పడీ పడీ మొక్కినాడు. సామీ నన్ను చెమించాల అన్నాడు. అపరాదం జరిగి పోయిందీ అన్నాడు. శివయ్యకి మామూలుగానే కుడుమిస్తే పండగ. పడీపడీ మొక్కినాక పడిపోకుండా వుంటాడా? కనికరించేసినాడు. 'వురేయ్ అర్జునా... నీ మంత్రాల బాణాలన్నీ మామూలోళ్లకాడనే పనికొస్తాయిరా... యిదిగో నేనిస్తండా తీస్కో పాసుపతం... యిది మొనగాడెంకన్నల్ని గూడా మెడలొంచి పడగొడ్తాది...' అన్నాడు. యిప్పుడింక అర్జునుడిగ్గూడా పండగే పండగ.

మాది శ్రీకాళాస్తి దగ్గిర్లో సిన్న పల్లి. మా వూరు కాళాస్తని జెప్పే టప్పుడు మాకు బలె కుశాల గుంటాది. సాలెపురుగూ, పామూ, ఏనుగూ!

పురుగులకీ జంతువులకీ మోచ్చుమిచ్చేసిన పిచ్చోడు మా శివయ్య. మోచ్చాన్ని గూడా యాపారం జేస్కోవచ్చని... గుండ్లు గొట్టేటోల్లకీ, బజన్లు జేసేటోల్లకీ, వుండీల్లో దుడ్లు దండిగా యేసేటోల్లకి మోచ్చాన్ని అమ్ముకోవచ్చనీ మా శివయ్యకి తెల్దు. మా వూళ్లో శివయ్య గుడి అందురికీ దెల్సు. యీడ దరంరాజులకి గూడా వొక గుడి వుండాదని మాబోటి పల్లెటూరోల్లకే దెల్సు. గుడి సిన్నదే. యెకరాలకొద్దీ నేల బావురుమంటా వుంటాది. యెప్పుడూ... తనమింద ఆడుకోడానికి రమ్మంటూ పసిపిలకాయిల్ని రెచ్చగొట్టి పిలస్తా వుంటాది. యేడాదికోమారు ఆసాడంలో మాత్తరం యీడ దరంరాజుల తిరనాల జరగతాది. తిరనాల పద్దినాలు వుంటాదిగానీ... తపసు, గుండాం రోజుల్లో మాత్తరం యిసకేస్తే రాల్దంటే నిజ్జెం.

ఆ తిరనాలలోనే, అర్జునుడి తపసుమాను కాడ కాసింత దగ్గర్లోనే నిలుచుకోని చూస్తాండం నేనూ అరితా. ఆ యమ్మికి యిదంతా శానా సిత్రంగా కనిపిస్తాండాది. అందులో అనుమానం లేదు. యెనకనించి వొకమ్మ అరితను సేత్తో తట్టి... "రొవంత జరుక్కోయేమికా.. కనపట్టంలే,"దంది.

యీ పిల్ల బిత్తరపోయింది. యెందుకంటే ఆ యమ్మకు ఓ యాబయ్యేం టాయి. యీ పిల్లకి యింకా యిరవై గూడా రాలా! మద్దెలో నేన్దూరి... "రొవ్వంత ఆగేమి కా.. అర్జునుడింక మానెక్కేస్తండాడ్లే," అన్నా.

మద్దెలో వుండాది తపసుమాను. పెద్ద తాటిమాకును దెచ్చి నిటారుగా నాటి నారు. దానికి మెట్లు మాదిరిగా రెండుపక్కలా కూసాలు గొట్టినారు. అర్జునుడు బుజానికి జోలి తగిలించుకోని... మిగిలిపోయిన పజ్జేలన్నీ పాడుకుంటా... వొక్కొక్క మెట్టూ యెక్కినాడు. కొనాకి యెక్కి గూట్లో గూసున్నాడు. యింకొన్ని మంత్రాలు జదివినాడు. ఆనాక జోలి దీసినాడు. జెనవంతా గోలగోల. అందురూ ముందరముందరకి నెట్టుకో నొస్తండారు. గొడుగులు యిప్పి యెల్లకిలా పట్టుకునేటోల్లూ... కోక కొంగులు పైకెత్తి యిశాలంగా యిప్పి పట్టుకునేటోల్లూ... అంతా మిడిమేలంగా వుండాది. అర్జునుడు జోలిలోంచి యిబూదిపండ్లూ, నిమ్మపండ్లూ దీసి తలోదిక్కు యిసిరినాడు. జెనం యెగబడి దొరకబుచ్చుకున్నారు. అన్నీ జల్లేసినాక జోలి కాలీ అయింది. జెనం కాలీ అయినారు.

నేనూ అరితా మిగిల్నాం. అంగల్లోల్లు సర్దుకుంటండారు. మేం నడస్తండాం.

"సేమ్యా అయిసు దింటావా" అనడిగినాను. మొహం ముడేసి తలడ్డంగా వూపింది. "మీ యమ్మకు జెప్పన్లే.." అన్నా. నవ్వింది. తీరా అయిసుబండోడు నా పరువు దీసినాడు. సేమ్యా అయిసు సప్పరించినాక... పెద్ద బాలేదన్నట్టుగా మూతిరిసింది. "ఐతే పాలైసు దీస్కో కా," అన్నాడు అయిసోడు. అది గూడా గిట్టించుకుందామని. "సాల్లేనా... అది మాత్రం బాగుంటాదని రాసిస్తావా," అని గసురుకున్నా. పిల్ల- అయిసు

మీద అయిసు దినేసి జలుబు పట్టుకునిందంటే కష్టం. పుల్లకుండే చెమ్మ ఆరిపోయేదాకా నాకేసింది. వోడికి అయిదు రూపాయల బిళ్లిచ్చినా. అంతేనా అని అనుమానంగా జూసింది. "మా సిన్నప్పుడు పద్దైదు పైసలే. పాలైసైతే పావలా. కానీ పావలా యెవురికాడా వుండదు కదా... యిదే తినేటోల్లం..." యివరంగా జెప్పుకుంటా తీస్కపోయినా. యిద్దరం నిదానంగా నడుసుకుంటా బస్టాండుకి బోతన్నాం.

"వాడ్డిడ్ దట్ వుమన్ సే టూ మీ," నడస్తాంటే కాసేపటికి అడిగింది.

యింగ్లీసు మాటొస్తే మనం దాని అర్దం పట్టుకుంటాం. ఆ పాటి సదూకున్నాం. కానీ, యిలా తటాల్న పిడుగులాగ పడిపోతే కొంచిం కష్టం. రవంత ఆగి, "పక్కకి జరుగు అక్కా అంది," అన్నా.

అరిత పెద్దగా నవ్వేసింది. "నన్ను అక్కా అంటుందా... మా పిన్ని ఏజ్ ఉంటుంది తనకి," తెలుగులోకి మారిపోయింది. ఆ పిల్లకి తెలుగొచ్చు. కానీ పరాకులో అలవాటుగా యింగ్లీసులో మొదలెడ్తాది. నేను గూడా నవ్వాను. "నువ్వు కూడా తనని అక్కా అన్నావ్... నీ కంటె చాలా చిన్నదానితో..." మళ్లీ పగలబడి నవ్వింది.

ప్యాంట్లూ సొక్కాలూ యేసుకునే ఆడోళ్లు మా కాలాస్తిలో గూడా వుండారు... గానీ, రోడ్లో జెనం ఈ యమ్మిని యిచిత్రంగా జూస్తండారు. పక్కన ముతక పంచిలో నేనుండాననో, అట్టా నవ్వతండాదనో మరి? "సిన్నదైతే యేంది... ఆడకూతుర్ని యింకేం అనేది," అన్నాన్నేను. అంతకు మించి యింకో యోచన రాలా.

బస్సుకోసం నిల్చుకోనుంటే వొక ముసిల్దొచ్చింది నా కాడికి. కర్ర తాటించు కుంటా నడస్తండాది. కళ్ల మింద అరిచెయ్యి నీడ బెట్టుకోని నన్ను జూస్తా... "అనా కాలంగి బస్సేడికొస్తాది నా," అనింది. అంతే... పక్కన్నించి పక్కుమని నవ్వు. ఈ యమ్మి ఆ పక్కకి దిరుక్కోని మూతికి చెయ్యడ్డం పెట్టుకోని నవ్వతండాది. ఆ యమ్మ గమనించలా...!

"నేన్జూపిస్తా రా కా," అంటా తీస్కెల్లి, బస్సు జూపించేసి నేను తిరిగొచ్చేదాకా నవ్వతానే వుండాది.

అరిత మా చిన్ని కూతురు. చిన్నివోళ్లు అమెరికాలో వుంటారు. నాల్రోజులు మా పక్క పల్లెల్ని చూసి పోవాలని ఈ పిల్ల యిప్పుడిట్టా వొచ్చింది.

* * *

నెల్నాళ్లప్పుడు చిన్ని ఫోన్జేసింది. "శ్రీనూ బాగున్నావా," అంది.

సిన్నప్పుడైతే యెంచక్కా 'సీనా' అని పిలిచేది, యిప్పుడంతా కలికాలం. "ఆ బాగుండా చిన్నీ," అన్నా.

"ఏంలేదూ... చిన్న పనిపడి ఫోన్ చేశా."

"చెప్పు... కిచ్చిలికాయ ఊరగాయ బెట్టి పంపించమంటా..." అన్నాను.

ఆవకాయి, నిమ్మకాయీ వోల్లకి అమెరికాలో గూడా దొరకతాయి. కిచ్చిలి కాయే... మన కొంపలో బెడితే తప్ప శానామందికి దొరకదు.

"అదికాదు... మా పెద్దమ్మాయి హరితని కొన్ని రోజులు ఇండియా పంపించాలని అనుకుంటున్నాం..."

"మదరాసూ అయిద్రాబాదూ బొంబాయీ అన్నీ జూపించెయ్యమంటావా..."

"అబ్బెబ్బే అవన్నీ వొద్దూ... తనకి మనవైపు ట్రెడిషన్సూ కల్చరూ అంతగా తెలియట్లేదు. వూర్లో ధర్మరాజుల ఉత్సవాలు జరుగుతాయి కదా..." మాట పూర్తిగాలా...

"అదేందో తిరపతెంకన్న తిరనాలకే పంపకపోయినావా... దిమ్మదిరిగేలా వుంటంది గదా..."

"అంత గ్రాండ్యూర్ ఫెస్టివల్స్ తను చాలా చూసింది. మనవైపు రూరల్ ట్రెడిషన్స్ చూస్తూ, మీ ఊరిలో ఉంటూ..." చిన్ని యేదో చెప్తండాదిగానీ మళ్లీ అడ్డం పడినా.

"యిది పెద్ద ఊరా ఏంది? నిండా నలబై గడపుండదు. సిన్న పల్లి."

"అదే అదే అలాంటి ఊర్లో ఉండి కల్చర్ తెలుసుకుంటుంది అని పంపాలనుకుంటున్నా. మీ యింట్లో వుండడం కుదురుతుందా..." సాగదీస్తోంది. నేను నవ్వేసినా.

"కుదరకపొయ్యేదానికి యేవంత పాటుండాదని? మనమ్మి అమెరికా నుంచి వొచ్చినా కూడు బెట్టబొయ్యేది అరిటాకులోనే! అమ్మి సుకుమార మన్జెప్పి బంగారం గింజలొండి పెట్టబొయ్యేదిలే. యింకేంది కష్టం. యిదిగో పలాన్రోజు పాపొస్తండాది సీనా... అన్జెప్పి పంపిచ్చెయ్యకుండా..." అన్జెప్పినా!

"థాంక్యూ శ్రీనూ... మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నానేమో..." యింకా నసగతాంది.

చిన్ని మాటల్లో శానా శానా మరేద కనిపిస్తండాది. యిల్లాంటి మరేదలు నేనెప్పటికి నేర్చుకోవాల? నా నోట యింతింతేసి మరేదలు తొంగిసూడక ముందే... నా మాట కొత్త సోకులు దిద్దుకోకముందే... కట్టెను కడతేర్చెయ్యి సామీ... అని మొక్కుకున్నా లోలోపల.

అదిగో, ఆ మాదిరిగా అరిత మా పల్లి కొచ్చింది. బిడ్డ బంగారం. కొంపలో మా కూడూ కూరలూ యిచ్చగిస్తండాయో లేదోగానీ... గమ్మున తినేస్తంది. వుద్దిపప్పు వూరిబిండి కాణ్నించి... ఎండుమిరపకాయి యేయించి, పప్పుతో యెనించిన పులుసు దాకా... ఏది నచ్చితే అది అడిగి మరీ పెట్టించుకుంటాది. పొద్దన్నెప్పుడైనా ఉప్పుడుకూడు సద్దిజేసి, చింతపండు, ఎరగడ్డ, ఉప్పుగల్లు, మిరపకాయా చిట్టి రోట్లో నలగేసి పచ్చడి గొడితే... ఓ ముద్ద జాస్తిగా తినేస్తాది. కిచ్చిలికాయ వూరగాయి సంగతి జెబ్బళ్లే. లొట్టలేస్తా సప్పరిస్తాది. పొద్దన్నే పితికేయేళకి యిత్తడిలోటా దీస్కొని కొట్టాంలో కొచ్చేస్తాది. పొదుగులోంచి నేరుగా లోటాలోకి సుయ్యి సుయ్యిమని పితకాల. బురుగు బురుగ్గా యెచ్చంగా వుండే పచ్చి పాలు లోటాడూ దాగేస్తాది. కాపీగ్గూడా మొండికేసేది లే...!

మా ఊరి పిలకాయిల్తో గూడా బాగా కలిసిపోయింది. ఆడ పిలకాయిలు దొరికితే తొక్కుడుబిల్లా, చెమ్మాచెక్కా... మగ పిలకాయిలు దొరికితే గోలీలూ, బొంగరాలూ, కోడీబిల్లా... వొచ్చినా రాకపోయినా అన్నీ ఆడేస్తుండాది. పక్కింటమ్మితో గూడా యీతకు పోతానంటే... నేను గూడా తోడుండి దిగుడుబాయికి తీస్కపొయ్యినా. ఏదన్నా అయితే మల్లీ చిన్ని కాడ చేతులు గట్టుకోని నిలబడాల. కాకపోతే కొంపలోనే రవంత యిబ్బంది. నా పెండ్లాన్ని పట్టుకోని, 'ఆంటీ కిచెన్‌లో హెల్ప్ చేస్తా,' అంటంది. కత్తిపీట యిస్తే యేలు తెగతాదేమో, రుబ్బురోటి పన్జెప్తే నలగతాదేమో, సనికెల రాయితో పొత్తరం జారి పైన బడ్తాదేమో, యిసుర్రాయిని అసలు తిప్పలేందేమో, రోకలిబండిస్తే పోటు కాలిమింద యేసుకుంటాదేమో, పొయికాడికొస్తే యే నూనె రవ్వో యెగిరి పడతాదేమో... అన్నీ బయాలే నాకు. నా పెండ్లాం మామూల్దిగాదు. 'అయ్యన్నీ వద్దు లేమ్మా,' అన్జెప్పి కవ్వం అంటగట్టిందా పిల్లకి. చల్ల చిలికేటప్పుడు కులుకు జూడాల... బలె ముచ్చటేస్తంది. కుండలో కవ్వం పెట్టి చిలికీ చిలికీ... మజ్జిగలో రవ్వంత యెన్న తేరగానే యేలితో యెత్తుకుని నాకేస్తంది.

దరంరాజుల తిరనాల మొదులుకాన్నించీ రోజూ కోవనూరు నుంచీ కాలాస్తి వొస్తాండాం, పోతండాం. కౌరవ పాండవ జెననం, బకాసుర వద, దౌపతమ్మ పెల్లి, దాయాల జూదం, వస్త్రాపరనం, పసుల్ని మలెయ్యడం అన్నీ అయిపొయినాయి. ఇయ్యాల తపసు. రేపు దుర్యోదన దుస్సాసన వద. యెల్లుండి గుండాం.

* * *

ఆరోజు రాతిరి అన్నాల కాడ అడిగింది అరిత. "అంకుల్... అర్జునుడు చెట్టు ఎక్కాక అలాగ లెమన్ ఫ్రూట్స్, యింకా విభూతి పండ్లు అందరి మీదా పారేశాడు ఎందుకు?"

"అదుష్టం అంటారు తల్లీ," అన్నాన్నేను. "యిబూదిపండు తింటే కొడుకు పుడతాడనీ... నిమ్మకాయి తింటే కూతురు పుడతందనీ నమ్మతాం. అందుకే సుట్టు పక్కల పల్లెల్నించీ యెక్కడెక్కడి గొడ్రాల్లంతా తపసుమాను కాడికి ఎగబడొస్తారు."

ఆ పిల్ల కల్లు నవ్వతండాయి. "పాపం... అమాయకులైన ప్రజల్ని, స్త్రీలని మోసం చేస్తున్నారు కదా దేవుడి పేరు చెప్తూ. నువ్వు కూడా నమ్ముతావా యివన్నీ? నువ్వు డిగ్రీ కూడా పాసయ్యావని చెప్పిందే మమ్మీ."

ఆ యమ్మి మాటాడతాంటే బలె ముచ్చటగా వుంటాది. వొక్కో మాటనీ కూడ గట్టుకుంటా... అది సరైందోకాదో మనసులో యోచించుకుంటా నెమ్మదిగా మాటాడ తంది. దొరల బాసలో జెప్పాలంటే, 'ఆర్యూ ఏ ఫూల్ టూ బిలీవ్ దిస్,' అని అడగతాంది. నేన్జెప్పినా...

"నమ్మితే మా నాయిన ముల్లె పోయేదేం లేదుగా తల్లీ. యేం జేద్దాం. ఆచారాలు బుట్టేపాటికి శాస్త్రరాలు పుట్టకపాయె. కడుపు పండని ఆడది ఆ దుక్కంలో యే అగాయి

త్తేనికో తెగబడకుండా యీ నిమ్మకాయ కాసింత ఆశె బుట్టించిందనుకో... అది సాలు గదా! ఆ ఆశెతో రెండేల్లు సాగదీస్తే... ఆలోగా కడుపైనా కాస్తాది... దైర్నమైనా సిక్కబడ్తాది... యింతోటి బతుకులకి ఆ మాత్తరం సాలు గదా...!" కొంచేపు తాళుకుంది.

"యూ మీన్ టూ సే, ఏ స్పార్క్ ఆఫ్ హోప్," ఆలోచన యేడ్నో పెట్టుకోని గాల్లోకి చూస్తా అనిందా పిల్ల. అప్పుడప్పుడూ అంతే... మన బాసలో మాటల్ని పేర్చుకోడం కుదరకుంటే గబుక్కున యింగ్లీసులోకి దూకేస్తాది.

"అట్నే అనుకోరాదామ్మా."

"ఇన్ ఏ వే, అవర్ రిచువల్స్, ట్రెడిషన్స్ ఆర్ లైక్ సైకలాజికల్ ట్రీట్‌మెంట్స్ గివింగ్ హోప్ టూ ది మాసెస్ ఇన్ డిస్ట్రెస్."

'చిన్నీ తరించిపోయింది నా జెనమ,' అనుకున్నా మనసులో వీళ్ల అమ్మను తలుసుకుంటా. ఆచారాలు పండగల గురించి యీ యమ్మికి యిలా అనిపించేట్టు జెప్తినా... అది చాలు అని బలే కుశాలగా అనిపించింది.

* * *

మరునాడు దురోదన దుస్సాసన వద కూడా అయిపొయ్యింది. కడాన, యియ్యాలే గుండాం. అగ్గిగుండాం. మద్దేనం కాడికి తీస్కెల్లిపొయ్యినా. ద్రౌపతమ్మ గుల్లోకి బొయ్యి దణ్నం బెట్టుకున్నాం. అలుగు నిలబెట్టినారు చెయిసాపు కత్తిని. కుండ అంచుమింద మొన ఆనించి! సూదిలాంటి కత్తిమొన మట్టి కుండ వంపు మింద ఆనించి నిటారుగా నిలబెడ్తే, మూడుదినాలు పడిపోకుండా అట్నే ఉంటాదది. అరిత చిత్తరంగా చూసింది దాన్ని.

పేరుకి అవి దరంరాజుల తిరనాల్లేగానీ... మొక్కులు పూజలు అన్నీ ద్రౌపతమ్మకే. యీ తిరనాల్లలోకెల్లా అగ్గిగుండానికొచ్చిన జెనం యింకోరోజుండరు. శివరాతిరి మాదిరిగా వుంటాది వూరు. శివరాతిరికి యెక్కడెక్కడ్నించో పెద్దపెద్దోల్లంతా కార్లూ యిమానాల్లో గూడా మా వూరికొస్తాంటారు. కానీ గుండానికి వొచ్చే జెనం యేరే! అల్లంతా పక్కాపక్కన పల్లెల్లో వోల్లే. నడుసుకుంటా, బండ్లుగట్టుకోనీ యేద్దొరికితే అది పట్టుకోనీ... యెగబడి వొచ్చేస్తారు. దానికి తగ్గట్టుగానే పొరుగూళ్లనుంచి అంగల్లు గూడా వొచ్చి పడతాయి. అయి పిలకాయిలకి బొమ్మలు, బుడ్డలు గాదు... ఆడోళ్లకి చమ్కీబొట్లూ, రంగు పిన్నీసులూ, మెరిసే రిబ్బన్లూ గాదు... మగోళ్లకి చలవద్దాలూ, చేతి గడియారాలూ గాదు... నానా అంగళ్లూ వొచ్చేస్తాయి. అడ్డానికీ నిలువుకేగాదు వంకరొంకరగా గూడా తిరిగే రంగులరాట్నాలన్నీ వొస్తాయి. బుడగల్ని కాల్చే తుపాకీలొస్తాయి. సబ్బులీ్న, డబ్బాలీ్న కొట్టే రింగులొస్తాయి... వొకటేంది రొండేంది... తిరనాల బోగవంతా గుండాంనాడే జూడాల.

చుట్టూ దిరిగి అయ్యన్నీ జూసుకుంటా... కడాకి, గుండాం పక్కకొచ్చి నిలబడ్డాం. యేళైంది.

గుండాం తొక్కేవోళ్లంతా పసుపు గుడ్డలు గట్టుకోని... కోనేట్లో మునిగి, పూల కిరీటాలు బెట్టుకోని, యేపాకు జుట్టుకోని గుంపులుగుంపులుగా వొచ్చి జమవతండారు. వూరువూరంతా సందులేకండా వుండారు జెనం. అవును మరి... దరంరాజుల తిరనాలంటేనే అగ్గిగుండాంనాడే అన్నింటికంటె తొక్కిడి జాస్తి. నాలుగుబారల నేల నాలుగు పచ్చాలుగా గుంటతొవ్వి నిప్పులు బోసినారు. నిప్పులు యెర్రగా కణకణ మండతండాయి. ద్రౌపతమ్మ అగ్గిగుండాం తొక్కినట్టుగా బారతంలో యేడుండాదో మాకు దెలవదు. మా తిరనాల్లలో మాత్తరం అదే ఆచారం. గుండానికి తూరుపు పక్క పూజారొచ్చి నిలబడ్డాడు. పడమరకి- గుడిపక్కగా దిరిగి దణ్ణం బెట్టుకున్నాడు. చేతిలో మల్లెల చెండుండాది. దేవుడికి మొక్కుకుంటూ ఆ మల్లెచెండుని నిప్పుల మీద దొర్లించినాడు. పూలు వాడకుండా యిచ్చుకుంటా అది ఆపక్కదాకా దొర్లుకుంటాబొయ్యింది. దోసిటితో పెరుగన్నం దీసుకోని నిప్పుల మీద జల్లినాడు. మెతుకులు మాడిపోకుండా వుండాయి. గుమ్మడికాయిని దిష్టిదీసి నాలుగు ముక్కలుగా కోసి... గుండాం నాలుగు మూలలకీ యిసిరేసినాడు. ఒక పట్టుగుడ్డలోకి, మూడు పిడికిళ్లతో మండే నిప్పుల్ని తీసుకోని ఆ గుడ్డని మూటగా కట్టినాడు. దాన్ని కాస్తా పల్లకీలో కూర్చోనుండే ద్రౌపతమ్మ కోక కొంగుకి కట్టినాడు. కొంగులో నిప్పులు యెర్రెర్రగా మండతండాయి.. గుడ్డ కాలడంలే. ద్రౌపతమ్మ పల్లకీని నెత్తికెత్తుకోని... గుండాంలో నిప్పుల్ని తొక్కుకుంటా... పరుగెత్తినాడు! నిప్పుల గుండాం... దాటగానే చిన్న పాలగుండాంలో అడుగులేసుకుంటా... అమ్మని కొలువు దీర్చినాడు. ఆ యెనకాల్నే పెద్దగా పొలికేకలు పెట్టుకుంటా... జెనం గుండాం మీదికి యెగబడినారు. నిప్పులే... కణకణ మండతానే వుండాయి... పిలకాయిలు, ఆడోళ్లు, మగోళ్లు, ముసిలోళ్లు వారాలేం లేకుండా తొక్కుకుంటా వొచ్చేస్తండారు. మా అరిత అలా నోరెల్లబెట్టేసి జూస్తా వుండిపోయింది.

''స్పెక్టాక్యులర్, ఫాబ్యులస్ అంక్.. మామయ్యా. ఇటీజ్ సో స్ప్లెండిడ్... అన్ బిలీవబుల్...'' బిడ్డ మురిసిపోతా వుంది. హమ్మయ్య... చిన్ని మనకో పన్జెప్పింది. పరవాలే... దాన్ని సక్కంగానే జేసేసినాం... అనిపించింది.

మొన్నోనాడు చిన్ని ఫోన్జేస్తే జెప్పినా. 'అంతా బానే వుండాదిగానీ చిన్నీ... పాప అంకులాంటీ అంటా వుంటేనే మాకేదో యిరుకిరుగ్గా వుండాది,' అని! కూతురికి ఎట్టా పిలవాల్నో చెప్పినట్టుండాది. అందుకే యిప్పుడిప్పుడే మా యిద్దరినీ యిట్టా పిలస్తాండాది. అదొక సంబరం... సొంత మడుసుల్తోనే మెసలతండామనే సంబరం.

ఆ తర్వాతి రోజుకు తిరనాల అయిపొయినాయి.

* * *

మెలమెల్లగా మా బాస గూడా వొచ్చేస్తండా దాయమ్మికి. అంటే మామూలుగా మాటాడేది గూడా తెలుగే... గానీ, మన తెలుగ్గాదు. అదంతా మడిగట్టుకోని,

తిరునామాలు బెట్టుకోని, గందం ముద్దర్లేసుకున్న బాస. మన్నిగాదు. యిప్పుడిప్పుడే కొంచింకొంచింగా మన యిహంలో కొస్తండాది. కాపోతే... మద్దెమద్దెలో మా మాటలు కొన్ని ఆ పిల్లకి తెగ నవ్వు తెప్పించేస్తంటాయి.

ఒక పొరుగింటమ్మ వొస్తాది. నా పెండ్లాం కాడికి బొయ్యి, 'అక్కా రొవ్వంత మజ్జిగ చుక్కుంటే యియ్యా... చేవిరికీ...'' అని సాగదీస్తాది. మళ్లీ గడప దాటి బయటి కొస్తా.. తిన్ని మీద గూసోనుండే నాతో... ''అన్నా మా పిలగాడ్ని బళ్లో యెయ్యాల.. రొవ్వంత అయ్యోరితో జెప్తావా...'' అంటాది. యీయమ్మి గడపకి ఆ పక్కజేరి కిసుక్కు మంటాది.

యెవుడో తలపండిపోయిన ముసిలోడు వాకిట్లోకి వొస్తాడు. 'సామీ రేపు నార్లు బొయ్యాల దినం బాగుండాదా,' అంటాడు. 'షష్టి నష్టి అంటారు గదా నా.. యెల్లుండి బోస్కోరాదా,' అన్జెప్తా. అదీ నవ్వే.

యింకా సల్లాడాలే యేస్కోడం తెలీని ఒక పిలకాయొస్తాడు. నా పెండ్లాం కాడికి బొయ్యి... 'అకా పొయిలోకి నాలుగు పిడకలు దెమ్మనిందికా... మా యెమ్మ,' అంటాడు.

యియ్యన్నీ మా అరితమ్మకి బలె నవ్వు తెప్పిస్తా ఉండేటివి. పుస్తకాలు జదువు కుంటానో... పక్కింటి పిల్ల దగ్గిర ముగ్గులు నేర్చుకుంటానో... నా పెండ్లాంతో గోరింటాకు పెట్టిచ్చుకుంటానో యీ మాటలిని ముసిముసిగా నవ్వుకునేది.

ఒకనాడు మద్దేనం, వాకిట్లో తాటాకు పందిలికింద పడక్కుర్సీలో కూచోని యేదో పుస్తకం చదువుకుంటాండా. ఆ యమ్మి పక్కనే గూచోని నా పెండ్లాంతో అచ్చింగాయలు ఆడతావుంది. అప్పుడడిగింది.

''మామయ్యా.. మమ్మీని నువు పేరుపెట్టి పిలుస్తావు. తాతయ్యని మామయ్యా అంటావు... డేడీని అన్నా అంటావు. ఏంటిది?''

''వరస సరిపోయిండ్లా తల్లీ... మామయ్య అల్లుడు అన్నేగా,'' అంది నా పెండ్లాం అందుకుని.

''మరలాగైతే నేన్నిన్ను పిన్నీ అనీ... మామయ్యను బాబాయ్ అని పిలవాలి కదా.''

''యేవోలే తల్లీ... మాకిట్టా అత్తా మావా అనిపించుకోవాలనే వుంటాదెప్పుడూ,'' అందది. నేను ఆలకిస్తా వుండిపొయినాను.

మఱ్రోజే అరిత అమెరికా పోక.

* * *

ఉస్మానుకి ఫోన్జేస్తే బాడుగ కారు దీస్కోనొచ్చినాడు. యిమానం కాడ్నించి పిల్లని తీస్కొచ్చేటప్పుడు నేనొక్కడ్నే పొయినా. నా పెండ్లాం కూడా వొస్తాననింది యీసారి వొదిలి పెట్టేదానికి, బిడ్డని వొదల్లేక! ఈ పద్దినాల్లో అంత చేరిక అయిపాయె బిడ్డ. అసలే ఆడబిడ్డ

ల్లేని కొంప. దానికి ముచ్చట తీరలా. అందరం మదరాసు బయల్దేరినాం. కాసింత దూరం బొయినాక...

"అంతా బాగానే ఉందిగానీ... మీ ఊర్లల్లో పిలుపుల్లో వరసలే నాకు ఎక్కడం లేదు మామయ్యా," అంది. నేను బదులియ్యలా. ఆలకిస్తా గూసున్నా.

"నీకంటె పెద్దదైన ఆమె నా బుజం తట్టి అక్కా అంటుంది. పండు ముసలా యన నిన్ను అన్నా అని పిలుస్తాడు. యింకొక లేడీ వస్తుంది... అత్తమ్మను అక్కా అంటుంది, నిన్ను అన్నా అంటుంది. పిలుపుల్లో వరస చెడిపోతోంది. అత్తమ్మ చెల్లికీ నువ్వు అన్నేనా? పిలగాడికీ ముసలోడికీ నువ్వు అన్నేనా?" నవ్వతాంది.

నేను కూడా నవ్వాను. మద్దెలో అందుకుని, "మాదంతే వరసల్తెలియని గుంపు," అంటా... నా పెండ్లామూ నవ్వింది. దానికి బుర్రలో గుజ్జు పలసన. ఎవురేది జెబితే అదే సత్తెం. ఆ యమ్మి మళ్లా మొదులెట్టింది.

"నువు మాత్రం మమ్మీ వాళ్ల నాన్నని మామయ్యా అంటావ్... మమ్మీ అక్కని, అంటే మా పెద్దమ్మని అక్కా అని పిలుస్తావ్... ఏంటిదంతా పద్ధతీ పాడూ లేకుండా... ఒకామెను అక్కా అంటారు... ఆమె భర్తను అన్నా అనేస్తారు... ఓ బుడ్డోడు వచ్చి ఆంటీని 'అకా' అని పిలస్తాడు. పిచ్చిగా లేదూ ఇది."

యీ మాటల్ని ఆ పిల్ల చానారోజుల్నించి దాసిపెట్టుకోని... యిప్పుడు బయట పెట్టిందని తెలిసిపోతండాది. బదులియ్యకుండా వుండిపొయినా. నా పెండ్లాం యిక యిక నవ్వతానే వుండాది.

"ఎవర్ యూ హేడ్ ఏ థాట్ ఆఫ్ ఇట్. యాజ్... ఇటీజ్ రిడిక్యూలస్," ముల్లులా గుచ్చుకుంటండాది మాట.

ఉస్మాను టీ తాగాలని కారాపినాడు. మాకందరికీ కార్లోకి సమోసాలు, టీ తెచ్చిచ్చినాడు. తిన్నాం. తాగాం. కారు మళ్లీ బయల్దేరింది. ఆయమ్మి యింకేమీ జెప్పేట్టు లే. నే మొదులెట్టినా...

"అరితమ్మా... అప్పుడెప్పుడో యివేకానంద సామి మీ వూరొచ్చి..." నా కడ్డం పడింది.

"ఆయనొచ్చింది చికాగో, మాది టెక్సాస్..."

"యేదో వొక సత్రకాయ వూర్లే. అమెరికానే గదా! ఆడికొచ్చి, బెదర్స్ ఎండ్ సిస్టర్స్ ఆఫ్ అమెరికా అనంగానే... మీవోళ్లకంతా... అదేలే... అమెరికావోళ్లకి చిత్తరంగా అనిపించింది గదా..."

"అంతేగా మామయ్యా... అక్కడంతా లేడీస్ అండ్ జెంటిల్మెన్ అనేదే పద్ధతి గదా..."

"మీవోళ్లకి అది యిచిత్తరవేగానీ... మాకు యిచిత్రం అనిపించలేదమ్మా...! అన్న దమ్ముళ్లారా అప్పజెల్లెళ్లారా అనంటే యీ యెర్రోళ్లు అంతగా ఆచ్చెరపోయేది యేముండా

దబ్బా అనుకున్నాం మేం. యెందుకంటే... మాకు యే ఆడది గనిపించినా అది అప్ప జెల్లే... యే మగోడు గనిపించినా అన్నదమ్ముడే... మా యెదవ బుఱ్రకి యింకోరకంగా జూడ్డం తెల్దమ్మా... అందుకే అట్నే పిలస్తంటాం... పద్ధతీపాడూ లేకండా...! బస్టాండ్‌లో యాబయ్యేళ్ల ఆడదానికి యే బస్సెక్కాలో తెలవకపోతే... ఇరయ్యేళ్ల పిలగాణ్ని 'అన్నా' అని పిలిచి అడగతంది. దాన్నేదో అంటారమ్మా... పెపంచికమంతా తోబుట్టువులే అన డానికి... అదేందో తట్టడం లేదే..."

"యూనివర్సల్ బ్రదర్‌హూడ్..." గబుక్కున అందించింది, జాగర్తగా యింట న్నట్టు.

"అట్టాంటిదే... దాన్ని మన బాసలో గూడా యేదో..."

"విశ్వమానవ సౌ... సౌభ్రా...త్రం..."

"బంగారుతల్లివమ్మా నువ్వు... మా పిలకాయిలకి నోరు దిరగనివి గూడా నేర్పినావు. యెంత బాగ జెప్పినావో... అదేనమ్మా అదే. పేరు తెలవకపాయినా, మా కందరికీ వుండేది అదే. మా మాటకి, మా బాసకి వరసుందో లేదో నాకు తెల్దమ్మా... కానీ మనసుంటాది... అది నిన్ను అక్కగానో సెల్లిగానో మాత్తరమే జూస్తాది... రేపు నీకు పెండ్లయ్యి పెనిమిటి వొస్తే వోడ్ని అన్నగానో తమ్ముడిగానో మాత్తరమే జూస్తాది... మీ నాయిన్ని నేను అన్నా అని పిలిసినా... మీ పెద్దమ్మని అక్కా అని పిలిసినా... అందుకే. కొన్ని జెనమలంతే తల్లీ... అట్టాగే యెలబారిపోతంటాయి..."

కొంచి ఆగినా. జవాబు రాలా.

"మా బాస అర్జునుడి తపసుమాను మాదిర్ది తల్లీ... అది, అర్జునుడు జోలినిండా దెచ్చిన వాటితో గొడ్రాల్లకి కొడుకుల్నీ కూతుర్లనీ యిస్తాది. అట్టాగ, బతుకు మింద ఆశ పుట్టిస్తాది. మా బాస, అడుగడుక్కీ కొత్త అప్పజెల్లెళ్లనీ అన్నదమ్ముళ్లనీ యిస్తాది... యిట్టాగ, బందాల్ని ముడి పెట్టేస్తాది..."

నేను ముందర సీట్లో గూసోనుండాను. యెనకల సద్దులేదు. ఆ యమ్మి క్కోప మొచ్చిందా? వొచ్చినా తప్పులేదు... అట్టాగని నేజ్జెప్పటమూ తప్పుగాదు. తెలుసుకోడానికి ఆళ్లమ్మ అమెరికా నుంచి యీడికి అంపిస్తే... తెలియజెప్పకుండానే తిప్పంపిస్తే యెట్టా? నాకు నేను సరిది జెప్పుకున్నాను.

యీలోగా యిమానాశ్రయమొచ్చింది. ఆ పెపంచికంలో, గందరగోలంలో పడి పాయినాం. సంచులన్నీ దించి చక్రాలబండిమీద బెట్టుకున్నాది. పోటమే మిగిలిందింక... ఆ పిల్ల లోపలకీ... మేం బైటికీ...

బిడ్డ యెల్లిపోతాందంటే... నాకు యేదోగా వుండాది. ముచ్చుగా ఉండిపాయినా. నా పెండ్లానికి కండ్లల్లో నీళ్లూరతండాయి. బిడ్డని దగ్గిరికి దీస్కోని నుదట్న ముద్దు పెట్టుకునింది. చీర కొంగుతో కళ్లొత్తుకునింది. యేళ మీరిపోతండాది. ఆ యమ్మి నా

దగ్గరకొచ్చి... 'యింక పొయ్యొస్తా,' అన్నట్టుగా చెయ్యిగలిపింది. నేను రెండు చేతుల్తో పట్టుకున్నా... మాటల్ని కూడగట్టుకోని...

"మళ్లీ రావాల తల్లీ," అన్నా.

ముచ్చటగా నవ్వింది. "యేం మావా... అంత తేలిగ్గా యిడిసిపెడతానను కున్నా... మళ్లీ వొస్తా... మీ వూళ్లో ముసిలక్కల్నీ పడుసన్నల్నీ అందర్నీ సిక్కుదీసి సక్క బెడ్తా... అత్తా... యేడు గంగల జాతరేళకి మళ్లీ వొస్తా. అప్పటిదాకా మావ జాగర్త."

అంకుల్ పాయె... మామయ్య పాయె... యిప్పుడు మావొచ్చింది. సెవుల్లో పండగ పండగ్గా వుండాది. ఆ యమ్మి మాటలింటా వుంటే లోపల కులుకు నిలవడం లే. మురిసిపోతా వుండా. దూరంగా యిమానానికేసి పోతా... ఆ పిల్ల యెనక్కి తిరిగి నవ్వతా వుంటే... నా పెండ్లాం... రెండు సేతులూ గాల్లో తిప్పి, యేళ్లు మడిచి కణతల కేసి గెణుపులు నొక్కుకునింది. పటపట మెటికలు యిరిగినాయి.

*తెలుగు వెలుగు మాసపత్రిక*
*డిసెంబర్ 2019*

❋



13 డిసెంబర్ 1972న చిత్తూరు జిల్లాలో పుట్టిన కె.ఎ. మునిసురేష్ పిళ్లె మొదటి కథ ఆదర్శిని పత్రికలో అచ్చయింది. 100కు పైగా కథలు రాశారు. రెండు కథాసంపుటాలు- *పూర్ణమూ నిరంతరమూ, రాతి తయారి;* ఒక నవల ప్రచురించారు. జర్నలిజం వృత్తిలో ప్రస్తుతం ఫ్రీలాన్సర్‌గా ఉన్నారు.

**చిరునామా:** **ఫ్లాట్ నెం. 501, అన్నమయ్య రెసిడెన్సీ, రోడ్ నెం. 38**
**అయ్యప్ప సొసైటీ, మాధాపూర్, హైదరాబాద్-500 081.**
***ఫోన్: 99594 88088*** **kamspillai@gmail.com**